డీటీ రెడ్డెప్ప అక్రమాలపై విచారణకు డిమాండ్

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ

మదనపల్లి : మండల సివిల్ సప్లయిస్ డీటీ రెడ్డప్ప రేషన్ దుకాణాలలో చేసిన అవినీతి, అక్రమాలపై మదనపల్లి సబ్ -కలెక్టర్ సమగ్ర విచారణ జరిపి తక్షణమే సస్పెండ్ చేసి, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ పట్టణ కార్యదర్శి తిరుమల డిమాండ్ చేశారు. మంగళవారం సబ్ -కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ నాయకులు నిరసన తెలిపి వినతి పత్రాన్ని సబ్‌కలెక్టరేట్ తపాలా విభాగానికి అందజేశారు. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ... మదనపల్లి రూరల్. పప్పిరెడ్డి గారిపల్లి షాప్ నెంబర్ 54 షేక్ లియాకత్, వీఆర్ఏ పేరుపై ఉండగా సీఎస్ డీటీ రెడ్డప్ప, రిటైర్డ్ సీఎస్ డీటీ సత్యకుమార్ ఇద్దరూ కలిసి గతంలో మదనపల్లి మండల తహసీల్దార్ గా పనిచేసిన రమాదేవి గారి సంతకాలు ఫోర్జరీ చేసి, తెలుగులో ఆర్డర్ కాఫీ కిషోర్ అనే పేరు మీద బినామీకి ఆ షాప్ ఇచ్చారన్నారు.



సబ్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

- మదనపల్లి అర్బన్ షాప్ నెంబర్ 48 డీలర్ రమాదేవి గత కొన్ని సంవత్సరాలుగా కర్నూలు నగరంలో ఉంటున్నారు సీఎస్ డీటీ రెడ్డప్ప మోహన్ కూమార్ అనే పేరు మీద బినామీకి షాప్ కేటాయించారన్నారు. అనధికారికంగా మరో 10 షాపులను అద్దెకు ఇచ్చినట్లు ఆరోపించారు.
- మదనపల్లిలో 35 ఎండీయూ వాహనాలు బియ్యం డోర్ డెలివరీకి ఉండగా, అందులో 30 మాత్రమే పని చేస్తున్నాయి. మిగిలిన 5 వాహనాలు పని చేయకున్నా బిల్లులు పెడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మదనపల్లి పట్టణ కార్యదర్శి తిరుమల,ముభారక్,భవణ నిర్మాణ కార్మిక సంఘం నాయకులు మురళి తదితరులు పాల్గొన్నారు.





మైనార్టీ నేత దుకాణం అధికారుల స్వాధీనం

కలికిరి: పట్టణానికి చెందిన హజ్ కమిటీ మాజీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు మహమ్మద్ రఫీ (మాసూం రఫీ) మండల పరిషత్ కాంప్లెక్స్ రూం నెంబరు ఒకటిని అద్దె ప్రాతిపదికన తీసుకుని దుకాణం నిర్వహిస్తున్నాడు. కాంప్లెక్స్ ప్రారంభం నుంచి సుమారు 15సంవత్సరాలుగా మండల పరిషత్‌కు అద్దె చెల్లిస్తున్నాడు. గత ఏడాది జూన్ నుంచి అద్దె చెల్లించలేదంటూ అధికారులు నోటీలిచ్చారు. దీంతో దుకాణం యజమానికి అధికారులకు చట్టపరంగా బదిలిస్తూ తాను అద్దె చెల్లిస్తానని తెలియజేసినా పట్టించుకోకుండా ఖాళీ చేయాలని నోటీసులిచ్చారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఎంపీడీఓ భానుమూర్తిరావు, రెవెన్యూ, పంచాయతీ అధికారులతో కలిసి తాళాలు వేసిన షాపునకు పంచనామా నిర్వహించి ఓపెన్ చేశారు. తాను అద్దె చెల్లిస్తానని చెబుతున్నా తన వద్ద అద్దె తీసుకోవడం లేదని, అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి కక్ష్య పూరితంగా వ్యవహరిస్తున్నారని బాధితుడు వాపోయాడు. మైనార్టీల పట్ల చిన్నచూపు తగదని, ఇన్నేళ్లుగా మండల పరిషత్‌కు అద్దె చెల్లిస్తున్న తన పట్ల అధికారుల తీరు శోచనీయమన్నారు.



మండల పరిషత్ కాంప్లెక్స్‌లో గదిని స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ

కలికిరి: రోడ్డు భద్రతపై స్థానిక సీఐ రెడ్డిశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి నాలుగు రోడ్ల కూడలి, ఆర్టీసీ బస్టాండ్ మీదుగా ఎల్లమ్మ ఆలయం వరకు ర్యాలీ నిర్వహించి, హెల్మెట్ ఆవశ్యకత, వాహనదారులకు సీట్ బెల్ట్ వినియోగంపై కరపత్రాలు అందజేసి వివరించారు. వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్, వాహన రికార్డులు కలిగి ఉండాలని, లేని ఎడల ట్రాఫిక్ నిబంధనల ప్రకారం అపరాధం విధించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పీసీలు, స్థానికులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

రామసముద్రం : మండలంలోని ఇద్దరు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి కింద ఎమ్మెల్యే షాజహాన్ బాషా మంగళవారం చెక్కులు పంపిణీ చేశారు. ఊలపాడుకు చెందిన అంజమ్మకు సీఎం సహాయనిధి కింద రూ. 1.04లక్షలు, కమతంపల్లెకు చెందిన ప్రభావతి కి రూ.51వేల చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం పెన్షన్‌లు పంపిణీ చేశారు.

నేడు రక్తదాన శిబిరం

మదనపల్లె సిటీ: నూతన సంవత్సరం పురస్కరించుకుని బుధవారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు వెల్ విషర్స్ వ్యవస్థాపకులు గిరీష్ తెలిపారు. స్థానిక జిల్లా ఆస్పత్రిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దాతలు ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు. రక్తదానం చేసిన దాతలకు తిరుమల లడ్డూ అందజేస్తామన్నారు.

ఆర్టీసీడి పోకు వర్ధంతితో నిరసన


బి.కొత్తకోట: 1991 మేలో ఏర్పాటైన బి.కొత్తకోట ఆర్టీసీ డిపోను 2005 డిసెంబర్ 31న తరలించి మదనపల్లె ఒకటవ డిపోలో విలీనం చేశారు. దీనితో ప్రతి ఏటా సీపీఐ నాయకులు నిరసనగా వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం స్థానిక జ్యోతిచౌక్‌లో డిపో ఫొటోకు దండ వేసి వర్ధంతి జరిపి నిరసన వ్యక్తం చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం వెంటనే డిపోను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.























క్లుప్తంగా

రేషన్ డీలర్ల రాత పరీక్షలు ప్రశాంతం


రేషన్‌డీలర్ల రాతపరీక్షను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె: మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో రేషన్‌షాపు డీలర్ల ఖాళీల భర్తీకి సంబంధించి మంగళవారం నిర్వహించిన రాతపరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. డివిజన్‌లోని 11 మండలాలకు సంబంధించి 119 షాపులకు నోటిఫికేషన్ వెలువరిస్తే..అందులో 13 షాపులు కోర్టు కేసుల కారణంగా దరఖాస్తులు స్వీకరించలేదు. కొన్ని షాపులకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోలేదు. దీంతో 82 షాపులకు 347 మంది అభ్యర్థులకు హాల్ టికెట్లు మంజూరుచేశారు. మంగళవారం బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 11 గంటల నుంచి 12.30 వరకు పరీక్ష నిర్వహించారు. పరీక్షకు 24 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ బీటీ కళాశాలలో జరుగుతున్న రాతపరీక్షలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సబ్ కలెక్టరేట్ ఏఓ రాఘవేంద్ర, తహసీల్దార్ ఖాజాబీ, ఆర్ఐ శేషాద్రి, సీఎస్ డీటీ ఫిరోజ్‌ఖాన్, సబ్ కలెక్టరేట్ సిబ్బంది కుమారి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగిపై సస్పెన్షన్ వేటు

కడప సెవెన్‌రోడ్స్: పెన్షన్ల పంపిణీలో ఒక్కో లబ్ధిదారుడి వద్ద రూ. 300–500 వరకు వసూలు చేస్తున్న జమ్మలమడుగు నగర పంచాయతీ వార్డు మహిళా సంరక్షణ సచివాలయ ఉద్యోగి ఎం.భారతిభాయిని కలెక్టర్ శ్రీధర్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు జమ్మలమడుగు మున్సిపల్ కమిషనర్ కె.వెంకట్రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వెరిఫికేషన్‌లో పెన్షన్ తొలగిస్తారంటూ లబ్ధిదారులను భయపెడుతూ ఆమె డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలను ఉల్లంఘించి ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

డ్రైవింగ్ శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి


అడ్మిషన్ పొందిన అభ్యర్థులతో డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీ డ్రైవింగ్ స్కూలు ద్వారా అందిస్తున్న శిక్షణను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కడప డిపో మేనేజర్ డిల్లీశ్వర్‌రావు సూచించారు. కడప డిపోకు సంబంధించి శిక్షణ పొందేందుకు హాజరైన 23వ బ్యాచ్ అభ్యర్థులతో ఆయన మాట్లాడారు. డ్రైవింగ్‌శిక్షణలో ఆర్టీసీ డ్రైవింగ్ స్కూలుకు విశేష గుర్తింపు ఉందన్నారు. సుదీర్ఘ అనుభవం కలిగిన నిపుణులైన ట్రైనర్‌చే శిక్షణ ఇస్తామన్నారు. అంతేకాకుండా వాహనాల విడిభాగాలకు సంబంధించి కూడా శిక్షణలో సమగ్రంగా తెలియజేస్తామని వివరించారు. భవిష్యత్తులో ఆర్టీసీలో ఏర్పడే ఖాళీల భర్తీలో కూడా కొంతమేర ప్రాధాన్యత ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అభ్యర్థులు ఏకాగ్రతతో పూర్తి స్థాయిలో శిక్షణలో చెప్పిన అంశాలన్నీ గుర్తించుకోవాలని సూచించారు. ట్రైనర్‌తోపాటు పలువురు ఆర్టీసీ అధికారులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

వర్చువల్‌గా వైవీయూ పాలకమండలి సమావేశం

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పాలకమండలి సమావేశం మంగళవారం వర్చువల్ విధానంలో నిర్వహించారు. ఏపీ ఉన్నత విద్యామండలి అధికారులు, ఉన్నతవిద్య ప్రిన్సిపల్ సెక్రటరీ తదితరులు వర్చువల్ విధానంలో హాజరుకాగా, వైవీయూలో పాలకమండలి సభ్యులు ఆచార్య పి. చంద్రమతీశంకర్, మూల మల్లికార్జునరెడ్డి, జె. వెంకటలక్ష్మి, కె. చిన్న సుబ్బారావు, పి. ముబీనాబేగం పాల్గొన్నారు. విశ్వవిద్యాలయానికి రెగ్యులర్ వైస్ చాన్సలర్ నియామకం కోసం సెర్చ్ కమిటీలో వర్సిటీ నామినీ కోసం ఈ సమావేశం మధ్యాహ్నం 2 గంటల సమయంలో నిర్వహించారు. వీసీ పోస్టుకు దరఖాస్తు చేసిన అభ్యర్థులు పాలకమండలి సమావేశానికి దూరంగా ఉండాలని పేర్కొనడంతో వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్, వైవీయూ, ప్రొద్దుటూరు కళాశాలల ప్రిన్సిపాల్స్ సమావేశానికి హాజరుకాలేదు. కాగా ఆంధ్రా విశ్వవిద్యాలయానికి చెందిన ఆచార్యులను నామినీగా నియమించినట్లు తెలిసింది.

వీసీని కలిసిన పాలకమండలి సభ్యులు

యోగివేమన విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులు విద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డిని కలిశారు. ఉపకులపతిగా నియమితులయ్యాక తొలిసారిగా వారు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ అభివృద్ధిపై చర్చించారు.

కృష్ణా జలాల హక్కుకు తూట్లు!

- ఉమ్మడి చిత్తూరుజిల్లాకు 12 టీఎంసీల కేటాయింపు
- జిల్లాకు తరలించే చెర్లోపల్లె జలాశయం నిండుగా ఉంది
- జీడిపల్లి జలాశయానికి వస్తున్న నీటిని ప్రధాన కాలువ ద్వారా శ్రీసత్యసాయిజిల్లాకు మళ్లింపు
- కృష్ణా జలాలుపై మౌనం దాల్చిన టీడీపీ మంత్రి, ఎమ్మెల్యేలు
- కుప్పానికి నీళ్లిచ్చే అవకాశం ఉన్నా పట్టని సీఎం చంద్రబాబు


పూర్తిస్థాయిలో నిండిన చెర్లోపల్లె జలాశయం


జీడిపల్లి జలాశయం నుంచి సత్యసాయిజిల్లాలోని ప్రధాన కాలువకు విడుదల చేసిన కృష్ణా జలాలు

బి.కొత్తకోట: అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని అనే సామెత ఉమ్మడి చిత్తూరుజిల్లా ప్రజలకు అతికినట్టు సరిపోతుంది. ఈ సామెతే కాదు..చుట్టూ సముద్రం ఉన్నా తాగేందుకు గుక్కెడు నీళ్ల కరువు అన్నట్టుగా తక్షణమే కృష్ణా జలాలను దిగువకు విడుదల చేసేందుకు చెర్లోపల్లె జలాశయం సిద్ధంగా ఉన్నప్పటికీ చుక్కనీటిని కూడా విడుదల చేయలేని పరిస్థితిలో కూటమి ప్రభుత్వం ఉంది. అంతేకాదు ఉమ్మడి చిత్తూరుజిల్లా హక్కును ప్రభుత్వం కాలరాస్తోంది. హంద్రీ–నీవా ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతానికి 12 టీఎంసీల కృష్ణా జలాలు కేటాయించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఉమ్మడిజిల్లాకు వాటా నీటిని తరలించాల్సిందే. అయినప్పటికి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి తరలిస్తున్న కృష్ణా జలాలు అనంతపురం జిల్లాలోని జీడిపల్లి జలాశయానికి చేరుతుండగా, ఆ నీటిని అక్కడ నిల్వ చేసుకోలేని పరిస్థితుల్లో ఉమ్మడిచిత్తూరుజిల్లాకు కాకుండా దారి మళ్లించి ప్రధాన కాలువ ద్వారా శ్రీసత్యసాయిజిల్లాకు తరలిస్తున్నారు. తమ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయంపై గొంతెత్తి ప్రశ్నించాల్సిన టీడీపీ మంత్రి, ఎమ్మెల్యేలు మౌనం వహిస్తున్నారు. కుప్పానికి సైతం నీటిని తరలించే అవకాశం ఉన్నా సీఎం చంద్రబాబు పట్టించుకోవడం లేదు.

చెర్లోపల్లెకు నీళ్ల నిలుపుదల

శ్రీసత్యసాయిజిల్లా కదిరి సమీపంలోని చెర్లోపల్లె జలాశయాన్ని అన్నమయ్యజిల్లాలోని తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, రాయచోటి, చిత్తూరుజిల్లాలోని పుంగనూరు, పలమనేరు, చిత్తూరు,కుప్పం, పూతలపట్టు, తిరుపతిజిల్లాలోని చంద్రగిరి నియోజకవర్గాలకు కృష్ణా జలాలను తరలించేందుకు నిర్మించారు. జలాశయం నుంచి పుంగనూరు ఉపకాలువ (పీబీసీ) మొదలై తంబళ్లపల్లె, మదనపల్లె, పుంగనూరు, పలమనేరు నియోజకవర్గం తిమ్మిరెడ్డిగారిపల్లె వరకు 220.350 కిలోమీటర్లు సాగుతుంది. ఇక్కడి నుంచి కుప్పం ఉపకాలువ మొదలై 123 కిలోమీటర్లు సాగి గుడిపల్లె మండలంలోని పరమసముద్రం చెరువులో కలుస్తుంది. ప్రధాన కాలువ సత్యసాయిజిల్లాలోని కదిరి నుంచి ఎన్‌పీకుంట మీదుగా అన్నమయ్యజిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం నుంచి పీలేరు, రాయచోటి నియోజకవర్గాల్లో సాగుతుంది. ప్రస్తుతం చెర్లోపల్లె జలాశయ నీటి సామర్థ్యం 1.608 టీఎంసీల నీళ్లు నిల్వ ఉన్నాయి. ఈ జలాశయానికి జీడిపల్లె జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తుండగా పదిరోజుల క్రితం నీటి విడుదల ఆపేశారు. ఈ నీళ్లన్నీ హంద్రీ–నీవా ప్రాజెక్టు రెండో దశలో పీబీసీ నియోజకర్గాల తోపాటు పీలేరు, చంద్రగిరి, పూతలపట్టుకు, రాయచోటి నియోజకవర్గానికి నీటిని అందించాల్సి ఉంది. వీటన్నింటికి కేటాయించిన 12 టీఎంసీల నీటిని ప్రభుత్వం తరలించాలి. చెరువులకు మళ్లించి ఆయకట్టు సాగుయ్యేలా చూడాల్సి ఉంది. ప్రభుత్వం జలాశయాల్లోని నీళ్లను విడుదల చేసి వినియోగించుకోలేని పరిస్థితుల్లో ఉంది.

కుప్పానికి ప్రయోజనమే

చెర్లోపల్లె నుంచి నీటిని పీబీసీకి విడుదల చేస్తే కుప్పం నియోజకవర్గానికి ప్రయోజనమే అయినా దీనికి ప్రాతినిథ్యం వహిస్తున్న సీఎం చంద్రబాబు కూడా ఆసక్తి చూపడం లేదు. గత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పీబీసీ ద్వారా కుప్పానికి తొలిసారి కృష్ణా జలాలు తరలించి చరిత్ర లిఖించారు. అయితే సీఎం చంద్రబాబు కృష్ణా జలాలను తరలించే విషయంలో పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

ప్రశ్నించని మంత్రి, ఎమ్మెల్యేలు: హంద్రీ–నీవా ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాలను తరలిస్తే ప్రయోజనం పొందేది రాయచోటికి చెందిన టీడీపీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, మదనపల్లె, పీలేరు, పలమనేరు, పుతలపట్టు, చంద్రగిరి, కుప్పంలో టీడీపీ ఎమ్మెల్యేలే ప్రాతినిథ్యం వహిస్తున్నారు. అయినప్పటికి ఎమ్మెల్యే నియోజకవర్గానికి కలిగే ప్రయోజనాన్ని విస్మరించి ప్రభుత్వాన్ని ప్రశ్నించడం లేదు. విడుదలకు నీళ్లు సిద్ధంగా ఉన్నా కనీసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి విన్నవించే ప్రయత్నం చేయడం లేదు. కృష్ణా జలాలు నియోజకవర్గాలకు తరలించకపోతే రైతుల్లో తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకోవాల్సి వస్తుందన్న విషయాన్ని ఎమ్మెల్యేలు గ్రహించాలి.

300 క్యూసెక్కులు మళ్లించారు

శ్రీశైలం ప్రాజెక్టు నుంచి వస్తున్న కృష్ణా జలాల్లో 777 క్యూసెక్కులు అనంతపురం జిల్లాలోని జీడిపల్లి జలాశయానికి వచ్చి చేరుతున్నాయి. ఈ జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 1.681 టీఎంసీలతో నిండుగా ఉంది. దీనితో వస్తున్న నీటిని చెర్లోపల్లె జలాశయానికి పంపే అవసరం లేదు. అలా అని నిల్వ ఉంచుకునే పరిస్థితి లేక జలాశయం నుంచి నీటిని ప్రధాన కాలువలోకి విడుదల చేశారు. వారం నుంచి రోజుకు 150 క్యూసెక్కులు విడుదల చేయగా మంగళవారం 300 క్యూసెక్కులకు పెంచారు. శ్రీసత్యసాయిజిల్లాలో సాగే ప్రధాన కాలువకు నీళ్లు చేరుతున్నాయి. ఉమ్మడి చిత్తూరుజిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు చేరాల్సిన నీళ్లను ఇలా దారి మళ్లించి అన్యాయం చేస్తున్నారు. అన్నమయ్యజిల్లా సరిహద్దులోని ఎన్‌పీ కుంట మండలం వరకు ప్రవహించే ఈ నీళ్లనైనా సరిహద్దులోని సారంగం నుంచి అధికారులు నీటిని జిల్లాలోకి తరలిస్తారా లేదా అన్నది స్పష్టత లేదు. సారంగం దాటిస్తే ప్రధాన కాలువలోకి తొలిసారిగా కృష్ణా జలాలు ప్రవహిస్తాయి. నీళ్లను అడివిపల్లె, శ్రీనివాసపురం జలాశయాలకు తరలించేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

ముందస్తు సంక్రాంతి సంబరం


సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఉట్టి కొడుతున్న వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు సందడిగా ప్రారంభమయ్యాయి. విశ్వవిద్యాలయంలోని గురుకులం ప్రాంగణంలో వాణిజ్య శాస్త్ర ఆచార్యులు డాక్టర్ జి. విజయభారతి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాలను వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, ప్రధానాచార్యులు ఎస్.రఘునాథరెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ తెలుగు ప్రజలకు సంక్రాంతి ప్రీతికరమైన పండగ అన్నారు. సంక్రాంతి రైతుల పండుగని, సంక్రాంతి నాటికి రైతులు పండించే నవధాన్యాలు ఇంటికి చేరుతాయన్నారు. అనంతరం అధికారులు, విద్యార్థులు, అధ్యాపకులు ఉట్టి కొట్టడంలో పోటీ పడ్డారు. విద్యార్థులు ఉత్సాహంగా గాలిపటాలను వదిలారు. విద్యార్థినులు ముగ్గులు వేసి గొబ్బెమ్మలు ఉంచారు. సంప్రదాయ కోలాటం, హరిదాసు సంకీర్తనలతో సంబరాలు కన్నుల పండగగా సాగాయి. పిల్లలను ఆశీర్వదించడం, భోగి మంటలు, సంక్రాంతి లక్ష్మీకి పూజచేసి పండగను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


యువత సందడి

పకడ్బందీగా దేహదారుఢ్య పరీక్షలు


లాంగ్‌జంప్ చేస్తున్న కానిస్టేబుల్ అభ్యర్థి

కడప అర్బన్: పోలీసు కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియలో భాగంగా ఉమ్మడి వైఎస్సార్ జిల్లాకు సంబంధించిన అభ్యర్థులకు కడప నగర శివార్లలోని జిల్లా పోలీసు శిక్షణా కేంద్రం (డి.టి.సి)లో దేహదారుఢ్య పరీక్షలు రెండవ రోజు మంగళవారం పకడ్బందీగా జరిగాయి. ఈ సందర్భంగా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు దేహదారుఢ్య సామర్థ్య పరీక్షలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షను పూర్తి చేసిన అభ్యర్థులకు సోమవారం నుంచి ఫిజికల్ మెజర్‌మెంట్, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్టులు ప్రారంభమయ్యాయన్నారు. జిల్లాలో 4,492 మంది అభ్యర్థులు పాల్గొంటున్నారన్నారు. ప్రతి రోజూ అభ్యర్థులకు మొదటగా సర్టిఫికెట్స్ పరిశీలన, ఎత్తు, ఛాతీ వంటి ఫిజికల్ మెజర్‌మెంట్స్ చేస్తారని, తరువాత బయోమెట్రిక్ తీసుకుంటారన్నారు. దేహదారుఢ్య పరీక్షలలో భాగంగా 1600 మీటర్లు, 100 మీటర్లు, లాంగ్‌జంప్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఎక్కడా ఎలాంటి ఆరోపణలు, పొరపాట్లకు తావులేకుండా ఆధునిక ఆర్.ఎఫ్.ఐ.డి కంప్యూటరైజ్డ్ టెక్నాలజీతో పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. డిజిటల్‌గా, పారదర్శకంగా ఈవెంట్స్ నిర్వహిస్తున్నామన్నారు. దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు వెరిఫికేషన్ కోసం ఖచ్చితంగా ఒరిజినల్ ధృవపత్రాలతో హాజరుకావాలని, నోటిఫికేషన్ వచ్చిన తరువాత జారీ చేసిన లేటెస్ట్ కులధృవీకరణ సర్టిఫికెట్, నాన్ క్రిమిలేయర్ సర్టిఫికెట్లు తీసుకురావాలన్నారు. ఆధార్, స్టేజ్–2, స్టడీ, మార్క్స్ లిస్ట్స్, అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ సర్టిఫికెట్లు అటెస్ట్ చేసినవి తప్పనిసరిగా తీసుకుని రావాలని సూచించారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్‌బాబు, ఏఆర్ అదనపు ఎస్పీ బి. రమణయ్య, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఐటీకోర్ టీం, డీపీఓ కార్యాలయం సిబ్బంది ఉన్నారు.

ప్రజాప్రతినిధుల హక్కులు హరిస్తారా!

- టీడీపీ వాళ్లు రాళ్లు, కర్రలతో కార్యాలయంలో తిష్ట వేస్తారా
- పెత్తనం చెలాయిస్తే భయపడేది లేదు
- ఎంపీడీఓల తీరుతో ఆగిన అభివృద్ధి పనులు
- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆగ్రహం


జెడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

బి.కొత్తకోట: తంబళ్లపల్లె నియోజకవర్గంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలు జరగకుండా అడ్డుకుని ప్రజాప్రతినిధుల హక్కులను హరించడం ఎలాంటి సంప్రదాయమని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం చిత్తూరులో జరిగిన జెడ్పీ సమావేశంలో పాల్గొన్న ఆయన తంబళ్లపల్లె నియోజకవర్గ సమస్యలు, అధికారుల తీరు, టీడీపీ సృష్టిస్తున్న అడ్డంకులపై అధికారులను నిలదీశారు. అనంతరం మాట్లాడుతూ మండల పరిషత్ సమావేశాలు జరగకుండా టీడీపీ శ్రేణులు అడ్డుకుంటుంటే ప్రభుత్వం ఏమి చేస్తోందని ప్రశ్నించారు. అప్పటికప్పుడు మండల మీట్ ఉందంటూ సర్క్యులర్లు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. మండలమీట్‌లను అడ్డుకుంటున్నారని కలెక్టర్, జెడ్పీ చైర్మన్, సీఈవోల దృష్టికి తెచ్చారు. సోమవారం జరిగిన తంబళ్లపల్లె మండల మీట్ సందర్భంగా పోలీసులు ఉన్నా రాళ్లు, కర్రలతో టీడీపీ శ్రేణులు కార్యాలయంలోకి కూర్చున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవాలని అన్నారు. దీనికి సంబంధించిన ఆధారాలను ఉన్నతాధికారులకు పంపామన్నారు. హైకోర్టు ఆదేశాలతో పీటీఎం మండలమీట్ నిర్వహిస్తుంటే కూడా అడ్డుకున్నారని అన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎంపీడీఓలు అడ్డపడుతూ చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఎంపీపీలు, జెడ్పీటీసీలు కోరిన పనులను ఎందుకు మంజూరు చేయడం లేదని నిలదీశారు. తప్పులుంటే సస్పెండ్ చేయాలేకాని అధికారం అడ్డుపెట్టుకుని పెత్తనం చెలాయిస్తామంటే సహించమని హెచ్చరించారు. ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో తాము అధికారులపై ఎలాంటి ఒత్తిళ్లుకాని, వారి విధుల్లో ఎక్కడా జోక్యం చేసుకోలేదని అన్నారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో పేదలకు ఇళ్లు మంజూరు చేసి ఖాతాల్లోని ఒక రూపాయి వేసి వదిలేశారని, ఇప్పుడా పేదలకు బిల్లు రాక, ఇళ్లు నిర్మించుకోలేని దుస్థితిలో ఉన్నారని అన్నారు. గత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదలందరికీ ఇళ్లు ఇచ్చారని, వారు నిర్మించుకునే ఇళ్లకు బిల్లుల సమస్య లేకుండా నిధులను జమ చేశారని అన్నారు. డిస్కం అధికారులు పెరిగిన విద్యుత్ చార్జిలపై ప్రజలకు అవగాహన కల్పించలేదని తెలిపారు. నియోజకవర్గానికి మంజూరైన ఆరు విద్యుత్ కేంద్రాలను ఎందుకు రద్దు చేశారని నిలదీశారు. ఎన్ని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేశారని ప్రశ్నించగా 1,700 మంజూరు చేసి 400 ట్రాన్స్‌ఫార్మర్లు పంపిణీ చేశామని అధికారుల చెప్పగా సంబంధిత నివేదిక ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. అధికారుల తీరు తప్పుదోవ పట్టించేలా ఉందని ప్రజల కోసం పనిచేయాలని కోరారు. మండల మీట్‌లు జరగకపోవడంపై స్పందించిన జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు 20 రోజుల్లోగా అన్ని మండలాల్లో సమావేశాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సీఈవోను ఆదేశించారు.

ప్రాణం తీసిన అతివేగం


ప్రమాద స్థలంలో మరణించిన నందీష్


ఆసుపత్రిలో మరణించిన అబ్దుల్

- కొత్త సంవత్సర వేడుకలకు వస్తూ ప్రమాదం
- డివైడర్‌ను ఢీకొన్న స్కార్పియో
- అక్కడికక్కడే ఒకరు, ఆసుపత్రిలో మరొకరు మృతి
- ఇంకొకరి పరిస్థితి విషమం


డివైడర్‌ను ఢీకొన్న స్కార్పియో

జమ్మలమడుగు/జమ్మలమడుగురూరల్ : ఏడాది చివరి రోజే వారి జీవితానికి ఆఖరు రోజు అవుతుందని అనుకోలేదు. అతివేగం వారి ప్రాణాలను హరించింది. సంఘటన స్థలంలోనే ఒకరు మరణించగా మరొకరు ప్రభుత్వాసుపత్రిలో మరణించారు. ఇంకొకరి పరిస్థితి విషమంగా ఉంది. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా..

వైఎస్ఆర్ జిల్లా పులివెందుల నియోజకవర్గంలోని వే ముల, లింగాల, పులివెందుల ప్రాంతాల కు చెందిన ఏడుగురు స్నేహితులు జనవ రి వేడుకలను నిర్వహించుకునేందుకు ప ర్యాటక కేంద్రమైన గండికోటకు పులివెందు ల నుంచి బయలు దేరారు. వీరిలో లింగా ల మండలం పెద్దకుడాల గ్రామానికి చెందిన అబ్దుల్, వేముల మండలం భూమ య్యగారిపల్లికి చెందిన నందీష్, పులివెందులకు చెందిన జగన్, షాహుల్, సింహాద్రిపురం అగ్రహారానికి చెందిన చైతన్య, షాజహాన్, ప్రేమ్ ఉన్నారు. ముద్దనూరు కొండ దిగిన తర్వాత చిటిమిటి చింతల గ్రామానికి సమీపంలో ఉన్న దర్గా మలుపు వద్దకు రాగానే వేగంగా వస్తున్న స్కార్పియోను అదుపు చేయలేక రోడ్డు పక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొన్నారు. వేముల మండలం భూమయ్యగారిపల్లి గ్రామానికి చెందిన నందీష్(21) అక్కడికక్కడే మృతి చెందగా కొన ఊపిరితో ఉన్న లింగాల మండలం పెద్ద కుడాల గ్రామానికి చెందిన అబ్దుల్(25)ను జమ్మలమడుగు ప్రభుత్వాసుపత్రికి తీసుకు రాగా చికిత్స పొందుతూ మరణించాడు. పులివెందులకు చెందిన జగన్ పరిస్థితి విషమించడంతో ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. చైతన్య, షాజహాన్, ప్రేమ్, షాహుల్ జమ్మలమడుగు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అర్బన్ పోలీసులు కేసు నమో దు చేసుకుని విచారణ చేస్తున్నారు.

కేంద్ర మంత్రి పర్యటనను విజయవంతం చేయాలి

కడప సెవెన్‌రోడ్స్: కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని వైఎస్ఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కేంద్ర శాస్త్ర సాంకేతిక, భౌగోళిక శాస్త్ర శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ పర్యటనపై కలెక్టర్ సంబంధిత జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకాంక్ష జిల్లాల లక్ష్య సాధనలో భాగంగా జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని సమీక్షించేందుకు జిల్లాకు వస్తున్న మంత్రి జితేంద్ర సింగ్ పర్యటన ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. కేంద్ర మంత్రి పర్యటన కోసం హెల్త్ అండ్ న్యూట్రిషన్, ఎడ్యు కేషన్, వ్యవసాయం – అనుబంధ రంగాలు, ఆర్థిక రాబడులు – స్కిల్ డెవలప్‌మెంట్, కనీస మౌలిక సదుపాయాల కల్పన తదితర రంగాల వారీగా జిల్లాలో సాధించిన ప్రగతి నివేదికలను ఆయా శాఖల అధికారులు సిద్ధం చేసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

మంత్రి పర్యటన ఇలా..

కేంద్రమంత్రి జితేంద్రసింగ్ మూడురోజుల పాటు జిల్లాలో పర్యటిస్తారు. తొలిరోజు తిరుపతి నుంచి బయలుదేరి కడపకు చేరుకుని రాత్రి ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో బస చేస్తారు. మరుసటిరోజు సీకే దిన్నె మండలం నాగిరెడ్డిపల్లెను సందర్శిస్తారు. అక్కడి విలేజ్ హెల్త్ క్లినిక్, అంగన్వాడీ కేంద్రం, వాటర్ కన్జర్వేషన్ ప్లాన్ స్టాల్‌ను సందర్శిస్తారు. అనంతరం జమ్మలమడుగు మండలం మోరగుడికి వెళతారు. అక్కడ స్వయం సహాయక సంఘాలతో సమావేశమై వివిధ అంశాలను పరిశీలిస్తారు. రహదారులు, డ్రైయిన్స్, తాగునీరు, హౌసింగ్ వంటి గ్రామాభివృద్ధికి సంబంధించిన మౌలిక సదుపాయాలను పరిశీలిస్తారు. అనంతరం గండికోటను సందర్శిస్తారు. మరుసటిరోజు ఉదయం 10 గంటలకు కడప నుంచి బయలుదేరి తిరుపతి ఎయిర్‌పోర్టుకు వెళతారు.

మంచి నడవడిక.. జీవన విధానం!

కొత్త ఏడాదిలో సరికొత్త ఆలోచనలు

మదనపల్లె సిటీ: కొత్త ఏడాది ...కొత్త ఆశలు.. సరికొత్త ఆలోచనలతో జిల్లా వాసులు నూతన సంవత్సరానికి స్వాగతం చెప్పారు. ఎన్నో ఆలోచనలు.. ఎన్నో ఊహలతో కొంగొత్త సంవత్సరంలో అయినా మంచి జరుగుతుందని సరికొత్త ఆశలతో ముందుకు వెళ్లాని నిర్ణయించుకున్నారు. నూతన సంవత్సరంలో ప్రజలు ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలో.. ఎలాంటివి పాటిస్తే మంచి నడవడికతో పాటు ..మంచి జీవన విధానం అలవడుతుందో తెలుసుకుందాం...

స్క్రీన్ టైమింగ్ తగ్గాలి

చిన్న పిల్లల నుంచి పెద్దవారి దాకా ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకూ మొబైల్ ఫోన్ లేనిదే గడవట్లేదు. కొత్త సంవత్సరంలో అయినా స్క్రీన్ టైమింగ్ తగ్గించుకోవాలని నిర్ణయించుకుంటే మంచిది. కళ్లతో పాటు, మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. ఈ నేపథ్యంలో స్క్రీన్ టైమింగ్ కాస్త తగ్గించుకుని ఆరోగ్యం కాపాడుకోవాలి.

సైబర్ వలలో పడకుండా...

సైబర్ నేరాలకు అంతులేకుండా పోతోంది. ఏ అవకాశం దొరికినా అందిపుచ్చుకునేందుకు సైబర్ నేరస్తులు ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో సైబర్ వలలో పడకుండా అప్రమత్తంగా ఉండేలా చూసుకోవాలి. సోషల్ మీడియాలో బ్యాంకు వివరాల గోప్యత పాటించడం, కొన్ని జాగ్రత్తలు వహించడం మనకే మంచిది.

పొదుపు మంత్రం

ఆర్థిక వ్యవహారాల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించడం నేర్చుకుంటే మంచిది. ఇప్పుడు చేసే పొదుపే రేపు వచ్చే ఇబ్బందుల నుంచి బయటపడేస్తుందనే విషయాన్ని మర్చిపోకూడదు. దుబారా ఖర్చులు తగ్గించుకొని జాగ్రత్తతగా ఖర్చు చేస్తూ పొదుపు మంత్రం పాటిస్తే ఎలాంటి ఒడిదుడుకులైనా ఎదుర్కొనే శక్తి మనకు ఉంటుంది. సంపాదనలో కొంత ఇన్సూరెన్సులోనో, మ్యూచువల్‌ఫండ్స్‌లోనో దాచుకోవడం మంచిది.

డ్రగ్స్‌కు దూరం

ప్రస్తుతం డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలు సమాజానికి చీడపురుగులా తయారయ్యాయి. డ్రగ్స్‌రహిత సమాజం కోసం మన వంతు కృషి చేద్దాం. డ్రగ్స్ తీసుకోవడమే కాదు. దానికి బానిసైన వారిని దూరంగా ఉంచేందుకు ప్రయత్నిద్దాం. దీనిపై పోలీసులకు సహకరిద్దాం.

పరులకు సహాయం

పరులకు సాయం చేస్తే మనకు తిరిగి ప్రకృతి సహాయం చేస్తుంది. అందుకే ఉన్నదాంట్లో తోచినంత పరులకు, అవసరం ఉన్న వారికి సహాయం చేయాలనే ఆలోచన చేస్తే మంచిది.

హెల్త్ ఈజ్ వెల్త్

ఎంత సంపాదించినా సరైన ఆరోగ్యం లేకపోతే ఉపయోగం ఉండదు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతి రోజూ గంట సమయం కేటాయించడం ఎంతో ముఖ్యం.

అరటి నిండా గింజలే


అరటి పండులో వరసలుగా నల్లటి గింజలు

బి.కొత్తకోట: అరటిపండులో అరుదుగా పండు మధ్యలో ఏదోఒక గింజ కనిపిస్తుంది. అయితే బి.కొత్తకోట మండలంలో ఓ రైతు ఇంటి వద్ద అరటి చెట్టుకు కాసిన గెలలోని పండ్లన్నింటిలోనూ నిండుగా నల్లటి గింజలున్నాయి. వివరాల్లోకి వెళితే.. బయ్యప్పగారిపల్లె గ్రామానికి చెందిన చిటికి వెంకటరమణారెడ్డి పొలంలో ఇంటిని నిర్మించుకున్నాడు. ఇంటి వద్ద ఓ అరటి చెట్టును పెంచుకుంటున్నాడు. మంగళవారం అరటిచెట్టుపై నుంచి గెలను దించాడు. అందులో పండిన పండ్లను తినేందుకు ఒలవగా పండు నిండా తొమ్మిది నుంచి 12 వరసలతో నల్లటి గింజలు ఉన్నాయి. ఒక పండులోనే ఇలా ఉంటుందని దాన్ని పక్కన పెట్టి మరో పండును ఒలవగా దానిలోనూ నిండా గింజలే. ఇలా ఎన్ని పండ్లలో చూసినా ఇలాగే ఉన్నాయి. ఈ విషయమై జిల్లా ఉద్యానవనశాఖ అధికారి రవీంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా నాటి అరటి చెట్టుకు కాసే గెలలోని పండ్లలో ఇలా గింజలు రావడం సాధారణమే అని చెప్పారు. అయితే దీన్ని పరిశీలిస్తామని ఆయన చెప్పారు.

‘సీమ’ సంస్కృతికి నిలువెత్తు రూపం బుడ్డా వెంగళరెడ్డి

కడప సెవెన్‌రోడ్స్: ఆకలిగొన్న వారిని అక్కున చేర్చుకుని అన్నం పెట్టి ఆదరించే రాయల సీమ సంస్కృతికి నిలువెత్తు ప్రతిరూపం ఉయ్యాలవాడ బుడ్డా వెంగళరెడ్డి అని వివిధ సంఘాల నాయకులు కొనియాడారు. రేనాటి సూర్యచంద్రుల విగ్రహ ఏర్పాటు కమిటీ ఆధ్వర్యంలో కడప ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం బుడ్డా వెంగళరెడ్డి 123వ వర్ధంతి జరిపారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ కలియుగ దాన కర్ణుడిగా ప్రసిద్ధి గాంచిన వెంగళరెడ్డికి తెలుగు రాష్ట్రాల్లో మరొకరు సాటిరారని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి ఎన్.రవిశంకర్‌రెడ్డి ఈ సందర్భంగా కొనియాడారు. డొక్కల కరువులో ఆకలి బాధ భరించలేక రాయలసీమలో వేలాదిగా మృత్యువాతపడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సేవా సమితి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పద్మప్రియ చంద్రారెడ్డి మాట్లాడుతూ కడప నగరంలో వెంగళరెడ్డి, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహాల ఏర్పాటుకు ఆమోదం తెలుపుతూ మున్సిపల్ జనరల్ బాడీ సమావేశంలో తీర్మానించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు లింగందిన్నె విజయభాస్కర్‌రెడ్డి, ఒరుగంటి నాగేంద్రబాబు, గొబ్బూరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తికి తీవ్రగాయాలు

కలకడ : ద్విచక్రవాహనం అదుపు తప్పి వ్యక్తికి తీవ్ర రక్తగాయాలైన సంఘటన చిత్తూరు-కర్నూలు జాతీయరహదారిపై కలకడ ప్రభుత్వ జూనియర్ కళాశాల రోడ్డు వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మంగళవారం కెవిపల్లె మండలం, తిమ్మాపురం పంచాయతీ బురుజుగానిపల్లెకు చెందిన రెడ్డిబాషా తన ద్విచక్రవాహనంలో కలకడకు వచ్చి తిరుగు ప్రయాణంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి పడ్డాడు. వెనుక ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. గాయపడిన రెడ్డిబాషాను కలకడ 108 సిబ్బంది ప్రథమ చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఏఓకు సన్మానం

పెద్దతిప్పసముద్రం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏఓగా పని చేస్తూ మంగళవారం ఉద్యోగ విరమణ పొందిన జ్యోతిలతను అధికారులు ఘనంగా సన్మానించారు. ఈమె గత నెల 15న ఇక్కడ ఏఓగా బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్‌తో పాటు కార్యాలయం సిబ్బంది శాలువలతో సత్కరించారు.

రామచంద్రయ్యకు మాజీ ఎమ్మెల్యేల పరామర్శ


రామచంద్రయ్యను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు చింతల, శ్రీకాంత్ రెడ్డి

కలికిరి: మాజీ మంత్రివర్యులు, ఎమ్మెల్యే సి.రామచంద్రయ్యను పీలేరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, రాయచోటి మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డిలు మంగళవారం పరామర్శించారు. ఎమ్మెల్సీ రామచంద్రయ్య కుమారుడు శ్రీవిష్ణు స్వరూప్(43) ఇటీవల పరమపదించిన సందర్భంగా మంగళవారం కడపలోని వారి స్వగృహానికి చేరుకుని ఎమ్మెల్సీని పరామర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పులికల్లులో ఎస్సీ, ఎస్టీలతో సమావేశం

పెద్దతిప్పసముద్రం: పౌర హక్కుల దినోత్సవంలో భాగంగా మంగళవారం అధికారులు మండలంలోని పులికల్లు దళితవాడలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సమావేశం నిర్వహించారు. దళితులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు రాగా వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని తహసీల్దార్ శ్రీరాములు నాయక్ అన్నారు.

ఎస్సీ, ఎస్టీ సమస్యలపై స్పందించాలి

– సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్


ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె : మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఎస్సీ,ఎస్టీ సమస్యలపై అధికారులు సత్వరమే స్పందించి పరిష్కారానికి కృషిచేయాలని ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ విజిలెన్స్ కమిటీ సభ్యులు కోరారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ అధ్యక్షతన డివిజనల్ స్థాయి ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ విజిలెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పలువురు దళిత, ప్రజాసంఘాల నాయకులు డివిజన్‌లోని ఎస్సీ,ఎస్టీ సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశాలు డివిజన్‌స్థాయిలో ప్రతి 3నెలలకు ఒకసారి, మండలస్థాయిలో నెలకు ఒకసారి జరపాలన్న నిబంధన ఉన్నప్పటికీ ఎక్కడా అమలుకావడం లేదన్నారు. అలాగే సివిల్‌రైట్స్‌డే సక్రమంగా జరుపుతున్న దాఖలాలు లేవన్నారు. సివిల్‌రైట్స్‌డే మాల, మాదిగ పల్లెల్లో కాకుండా గ్రామనడిబొడ్డున రచ్చబండల వద్ద జరిపితే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. దళితులకు శ్మశానస్థలాల కేటాయింపుపై ప్రతి సమావేశంలో సభ్యులు ప్రస్తావిస్తానే ఉన్నప్పటికీ, అధికారులు ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదన్నారు. చివరి మజిలీకి సైతం వివక్షను ఎదుర్కొని రావడం బాధాకరమన్నారు. బహుజన సేన అధ్యక్షులు శ్రీచందు మాట్లాడుతూ.. ప్రజాసంఘాల నాయకులపై గతంలో మదనపల్లెలో పనిచేసిన పోలీస్ అధికారులు ఉద్దేశపూర్వకంగా నమోదుచేసిన కేసులపై విచారణ జరిపి రౌడీషీట్‌లు ఎత్తివేయాల్సిందిగా కోరారు. మాలమహానాడు యమలాసుదర్శనం మాట్లాడుతూ..గతంలో నిర్వహించిన కులగణనలో అనేక పొరపాట్లు జరిగాయని, వాటిని సరిదిద్దేందుకు క్షేత్రస్థాయిలో విచారణ జరపాలన్నారు. మదనపల్లె పట్టణం చిత్తూరుబస్టాండ్ సమీపంలో ఎస్సీ కార్పొరేషన్ స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమిస్తే, మున్సిపల్ అధికారులు స్పందించలేదన్నారు. రెవెన్యూ అధికారులు సర్వే చేసేందుకు దరఖాస్తుదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఎంఆర్‌పీఎస్ నరేంద్ర మాట్లాడుతూ..ముద్దలదొడ్డి గ్రామంలో కులగణనలో ఎస్సీలను ఓసీలుగా నమోదుచేశారన్నారు. ఎస్సీలను ఆది ఆంధ్రులుగా నమోదుచేస్తున్నారని, వాటి సవరణకు సమయం ఇస్తూ, చదువుకున్న వారి టీసీల ఆధారంగా రక్తసంబంధీకుల కులాన్ని నమోదు చేయాలన్నారు. పీటీఎం మండలంలోని టీ.సదుం, రాపూరివాండ్లపల్లె, మడుమూరు, రంగసముద్రం, సాలేవాండ్లపల్లెకు చెందిన విద్యార్థులు రవాణాసౌకర్యం లేక పాఠశాలలకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారన్నారు. సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ మాట్లాడుతూ...సబ్ కలెక్టరేట్ ఫైళ్ల దగ్ధం కారణంగా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు సక్రమంగా నిర్వహించలేకపోయామని, ఇకపై ప్రతి 3 నెలలకు ఒకసారి క్రమం తప్పకుండా జరుగుతాయన్నారు. సభ్యులు సమావేశంలో ప్రస్తావించిన సమస్యలను మినిట్స్‌బుక్‌లో నమోదుచేసి, తదుపరి సమావేశంలో తీసుకున్న చర్యలను నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ దర్బార్ కొండయ్యనాయుడు, ఏఓ రాఘవేంద్ర, తహసీల్దార్ ఖాజాబీ, ధనంజయులు, నిర్మలాదేవి, మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, సీఐ రమేష్, ఎస్‌ఐలు చంద్రశేఖర్, గాయత్రి, దిలీప్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ భూములు పరిరక్షించండి


తహసీల్దార్ భీమేశ్వర్‌రావుకు అర్జీ ఇస్తున్న సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా

పీలేరు రూరల్ : పీలేరు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూమలను అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని సర్పంచ్ హబీబ్‌బాషా, వార్డు మెంబర్లు మంగళవారం తహసీల్దార్ భీమేశ్వర్‌రావుకు వినతిపత్రం ఇచ్చారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన రెవెన్యూ సదస్సులో వివిధ సమస్యలు తహసీల్దార్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఏపీఐఐసీ లేఅవుట్లలో ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన భూములను పరిరక్షించాలన్నారు. గ్రామ పంచాయతీకి సంబంధించి భూములు గుర్తించి భద్రత కల్పించాలని కోరారు. పంచాయతీ పరిధిలో ప్రజా మరుగుదొడ్లకు అనువైన స్థలం కేటాయించాలన్నారు. రెవెన్యూ సదస్సులో మొత్తం 42 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ కిరణ్మయి, వీఆర్వో రెడ్డిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

108 ఉద్యోగికి ఆర్థిక సాయం


108 వాహన పైలట్ అంజికి ఆర్థిక సాయం అందిస్తున్న యూనియన్ నాయకులు

నిమ్మనపల్లె / కలికిరి: 108 వాహన పైలెట్ గా పని చేస్తూ ఇటీవల ప్రమాదంలో గాయపడిన ఉద్యోగికి ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ.రమణ, వర్కింగ్ ప్రెసిడెంట్ రెడ్డి జస్వంత్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయాన్ని అందజేసినట్లు తెలిపారు. పెద్దమండ్యం మండలంలో 108 వాహన పైలెట్‌గా పని చేస్తున్న ఆంజీ ఇటీవల విధి నిర్వహణలో ఉండగా వాహనం టైరు పేలి ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. మంగళవారం కలిచెర్లలోని అంజి ఇంటికి చేరుకొని జిల్లాలోని 108 వాహన ఉద్యోగుల సహకారంతో రూ.20,000 నగదు ఆర్థిక సాయం వారి కుటుంబానికి అందజేశారు. బాధితుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో 108 యూనియన్ నాయకులు చలపతి, వెంకటరమణ, రామాంజులు, ప్రభాకర్, నాగేంద్ర, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ మండల్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలి


తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

పీలేరు : బీసీ మండల్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని కోరుతూ బీసీ ఉద్యోగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం డీటీలు సుబ్రమణ్యం, విజయ్‌కుమార్‌రెడ్డిలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ రాయల్‌బాబు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ బీసీల ఆర్థిక సామాజిక స్థితిగతులను మెరుగుపరచడానికి ఏర్పాటు చేసిన 39 సిఫార్సులు 44 సంవత్సరాలుగా అమలుకు నోచుకోలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు గుర్రం నారాయణ, రామాంజులు, నక్క వెంకటరమణ, రామచంద్రయ్య, రమేష్, రమణ, నారాయణ, జి. లోకనాథం, రామకృష్ణ, రాజేష్, వి. శివానందన్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

పెద్దతిప్పసముద్రం: భూ సమస్యలను పరిష్కరించడమే రెవెన్యూ సదస్సుల లక్ష్యమని తహసీల్దార్ శ్రీరాములు నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని కాట్నగల్లులో జరిగిన సదస్సులో ప్రజలు భూ సమస్యలతో పాటు ఇతర శాఖలకు సంబంధించిన అర్జీలను సమర్పించారు. అధికారులు వారికి ఆన్‌లైన్ రశీదులను అందజేశారు. సర్పంచ్ గిరీష్, ఎంఈఓ-టూ గౌస్‌పీర్, సర్వేయర్ శ్రీవాణి, ఆర్‌ఐ బాలాజీ, వీఆర్వోలు మంజునాథ్, రమణ, హైదర్‌షా, రామక్రిష్ణ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే నివాళి

కలికిరి(వాల్మీకిపురం): మండలంలోని జర్రావారిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బొగ్గల ఆనంద్ తల్లి బొగ్గల లక్ష్మమ్మ(85) మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి జర్రావారిపల్లికి చేరుకుని లక్ష్మమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు ఆనందరెడ్డి, శ్రీనివాసులు, విశ్వనాథ్, చలపతి, సురేష్, నరసింహులు, వెంకటపతి తదితరులు మాజీ ఎమ్మెల్యే వెంట పాల్గొన్నారు.

జాతీయ మహాసభలను విజయవంతం చేయండి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ములకలచెరువు: అఖిల భారత దళిత హక్కుల ఉద్యమ రెండవ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని అన్నమయ్య జిల్లా దళిత హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు హరికుమార్, కార్యదర్శి సుధీర్‌కుమార్ కోరారు. మంగళవారం స్థానిక మండల కేంద్రంలో వారు కరపత్రాలను ఆవిష్కరించారు. జనవరి 5, 6, 7 తేదీల్లో తెలంగాణ రాష్ట్రం ఖైరతాబాద్‌లో జరిగే కార్యక్రమానికి తరలిరావాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మంత్రాల రమణ, ఆదిమూర్తి, వెంకరమణ, సుబ్బన్న, రెడ్డెప్ప తదితరులు ఉన్నారు.

ముందస్తు నూతన సంవత్సర వేడుకలు


ముందస్తు నూతన సంవత్సర వేడుకల్లో పీలేరు అభివృద్ధి సమితి నాయకులు

పీలేరు రూరల్ : స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో పీలేరు అభివృద్ధి సమితి ఆధ్వర్యంలో మంగళవారం ముందస్తు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం కుమార్ మాట్లాడుతూ ఆర్టీసీ ప్రయాణం సురక్షితమైందని తెలిపారు. రహదారి భద్రత, శాంతి భద్రతల గూర్చి వివరించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి సమితి సభ్యులు వి. రామచంద్ర, గంగిరెడ్డి, జాకీర్‌హుస్సేన్, కిషోర్‌కుమార్, ఎం. జాకీర్, డాక్టర్ పి.వి.ఎస్. లక్ష్మీ, రాయల సుధాకర, రమణ, చాన్‌బాషా, మహబూబ్‌బాషా, కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

నూతన సంవత్సరానికి చర్చిలు ముస్తాబు


విద్యుత్‌దీపాల వెలుగుల్లో జేసీఎం చర్చి

మదనపల్లె సిటీ: నూతన ఆంగ్ల సంవత్సరానికి మదనపల్లె పట్టణంలో చర్చిలు ముస్తాబు చేశారు. రంగు రంగు విద్యుత్‌దీపాలతో అలంకరించారు. బుధవారం ఉదయం స్థానిక జేసీఎం చర్చిలో ఉదయం 10 గంటలకు ప్రత్యేక ఆరాధనలు జరుగుతాయని చర్చి సంఘ కాపరి రెవ. సునీల్‌వరకుమార్ తెలిపారు. అలాగే స్థానిక కురవంకలోని హోసన్నా గోస్పల్ మిషన్, బాకావానితోటలోని ఇమ్మాయల్ మినిస్ట్రీస్, సీఎస్‌ఐ ఉన్నత పాఠశాల ఆవరణంలోని షకీనా ఫెయిత్ ఫౌండేషన్ చర్చి, బెంగుళూరు రోడ్డులోని ఆరోగ్యమాత చర్చి, ఆరోగ్యవరంలోని సెయింట్‌లూక్, గుడిసివారిపల్లెలోని చర్చిలు నూతన సంవత్సర వేడుకలకు ముస్తాబు చేశారు.

వైఎస్సార్ సీపీ అభిమానులకు పింఛన్ నిలిపివేత

కలకడ : వైఎస్సార్ సీపీ అభిమానులకు అధికారులు పింఛన్ కట్ చేశారు. పింఛన్ పుస్తకాలతో మంగళవారం కలకడ మండలంలోని రాతిగుంటపల్లె పంచాయతీలో లబ్ధిదారులు నిరసన వ్యక్తం చేశారు. వివరాలిలా.. రాతిగుంటపల్లె పంచాయతీకి చెందిన దారా వెంకట్రమణ, ముత్యాల చంద్రశేఖర్‌లు డప్పు కళాకారులుగా గత 5 సంవత్సరాలుగా పింఛన్ పొందుతున్నారు. అలాగే అదే పంచాయతీకి చెందిన యం.వెంకట్రమణ, పి.శ్రీరాములు, పి.వెంకట్రమణరెడ్డిలు వృద్ధాప్య పింఛన్ తీసుకుంటున్నారు. మూడు నెలల క్రితం వరకూ నెలవారి ఇంటి వద్దనే పింఛన్ పొందిన వారికి కూటమి ప్రభుత్వం రాగానే పింఛన్ తొలగించాలని కుట్ర చేశారు. అక్టోబర్ 2024లో 12 మందికి నోటీసులు ఇచ్చి పింఛన్ నిలిపివేశారు. దీంతో బాధితులు జిల్లా కలెక్టర్ వద్ద వారి అర్హతను చూపించడంతో పింఛన్ పునరుద్ధరించారు. అయినా కూటమి కార్యకర్తలు వైఎస్సార్ సీపీ అభిమానుల పింఛన్ రద్దుచేయడానికి పరిశీలన పేరుతో మళ్లీ అధికారులపై ఒత్తిడి తెచ్చి పింఛన్ తొలగించారని బాధితులు ఆరోపించారు. వారిలో 7మందికి తిరిగి పింఛన్ అందజేయగా జనవరి-1వ తేదీన అందించాల్సిన పింఛన్‌ను ఒక రోజు ముందుగా మంగళవారం అందరికీ అందించి వారికి మాత్రం నోటీసు ఇచ్చి పింఛన్ నిలిపివేసినట్లు తెలిపారు.

ఎస్సీ కులగణన పారదర్శకంగా నిర్వహించాలి

పీలేరు రూరల్ : ఎస్సీ కులగణన పారదర్శకంగా నిర్వహించాలని ఎమ్మార్పీస్, ఎంఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండికోట వెంకటేష్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈవోపీఆర్‌డీ లతీఫ్‌ఖాన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ కులాల వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ అలుపెరగని పోరాటం చేస్తున్నట్లు తెలిపారు.

ప్రతి ఇంట్లో ఆనందం నింపాలి


నిసార్‌అహ్మద్

మదనపల్లె : నూతన సంవత్సరం మదనపల్లె నియోజకవర్గంలోని ప్రతి ఇంట్లో ఆనందం నింపాలని, ఆరోగ్యం అందించాలని, సుఖశాంతులు వెల్లివిరియాలని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ ఆకాంక్షించారు. బుధవారం నూతన సంవత్సరం 2025 సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాదిలోనైనా కూటమిప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలుచేయాలని కోరారు.

సుఖసంతోషాలతో వర్ధిల్లాలి


మాజీ ఎమ్మెల్యే చింతల

కలికిరి: ఆంగ్ల నూతన సంవత్సరాదిలో ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆకాంక్షించారు. నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని మంగళవారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అందరూ ఈ నూతన ఏడాదిలో సిరిసంపదలు, ఆయురారోగ్యాలతో ఉండాలని, కష్టాలు తొలగి సంతోషాలు వెల్లివిరియాలని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

గోకుల నిర్మాణాలను పూర్తి చేయండి


గోకులం షెడ్డును పరిశీలిస్తున్న డ్వామా పీడీ వెంకటరత్నం

కలకడ : మండలంలో నిర్మిస్తున్న గోకులం షెడ్లు జనవరి 10 లోపు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా డ్వామా పీడీ వెంకటరత్నం సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మండలంలోని కలకడ దొడ్డిపల్లె, కలకడ పంచాయతీలలో నిర్మాణంలో ఉన్న గోకులం షెడ్డు పనులను తనిఖీ చేశారు. మండలంలోని పేదలు 60 మందికి గోకులం షెడ్లు మంజూరు చేశారు. గోకులంలో గోవులను సంరక్షించడం వలన వాటి శుభ్రత, వసతులు కలిపించడంతో పాటు, పశుగ్రాసం వృథా కాకుండా ఉంటుందని గుర్తు చేశారు. పచ్చిరొట్ట ఎరువుల తయారు చేయడానికి ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. సేంద్రియ ఎరువులు తయారీకి ఎంతో ఉపయోగమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ, ఏపీఓ, ఉపాధిహామి సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

రామసముద్రం : ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని విద్యాశాఖ అధికారులు హేమలత, ఆంజనేయులు తెలిపారు. మంగళవారం చొక్కాండ్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు ప్రభాకర్ రావు పదవీ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రభాకర్ రావు సేవలను కొనియాడారు. పిల్లల విద్యాభివృద్ధికి ఆయన ఎంతగానో కృషి చేసినట్లు పేర్కొన్నారు. ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడియాల మురళి, మండల అధ్యక్షుడు అయూబ్ ఖాన్ మాట్లాడుతూ 35 ఏళ్ల పాటు ఉపాధ్యాయవృత్తిలో ఉంటూ ఎందరో విద్యార్థుల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసిన ప్రభాకర్ రావు సేవలు ప్రశంసనీయమని చెప్పారు. పాఠశాల అభివృద్ధికి ,పిల్లల చేయూతకు ఎన్నో సామాజిక, సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ప్రభాకరరావు, విజయరాణి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ ఎం లు సందీప్, జనార్దన్ రెడ్డి, మునుస్వామి నాయక్, మస్తాన్ బి, సందీప్, వేదవతి శ్రీరాములు రెడ్డి, మహీధర్ రావు, మనోహర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.